సాక్షి సిద్దిపేట

బుధవారం ၊ 28 ၊ జూన్ ၊ 2023



సర్పంచ్ టు రాజ్యసభ

ఉమ్మడి మెదక్ జిల్లాలో సర్పంచ్ నుంచి రాజ్యసభ సభ్యుడిగా ఎదిగిన సోలిపేట రామచంద్రారెడ్డి పై సాక్షి కథనం. 8లో..



పశువుల పట్టివేత

రెండు డీసీఎంలలో అక్రమంగా తరలిస్తున్న పశువులను పోలీసులు పట్టుకున్నారు. 8లో..



సమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు తెలిపారు. 9లో..

న్యూస్‌రీల్

అభివృద్ధికి బాటలు వేయాలి



ములుగులో గ్రామ నర్సరీని పరిశీలిస్తున్న రాజేశ్వర్

ములుగు(గజ్వేల్): గ్రామ పంచాయతీలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధికి బాటలు వేయాలని జాతీయ గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రొఫెసర్ రాజేశ్వర్ సూచించారు. మంగళవారం ములుగును సందర్శించిన ఆయన సర్పంచ్ బట్టు మాధవిఅంజిరెడ్డి అధ్యక్షతన గ్రామ పంచాయతీ కార్యాలయంలో మహిళలతో నిర్వహించిన సమావేశంలో అడిషనల్ డీఆర్‌డీఓ కౌసల్యదేవితో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు పట్టుదలతో అన్ని రంగాల్లో రాణించాలన్నారు. మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా పయనించాలన్నారు. గ్రామంలో అభివృద్ధిని గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో నిర్మించిన వైకుంఠధామం, డంపింగ్‌షెడ్, పల్లెప్రకృతి వనం, క్రీడాప్రాంగణం, గ్రామ నర్సరీలను వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శాంతి, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఉచిత సివిల్ కోచింగ్ ఇవ్వనున్నట్లు, ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి రాంగోపాల్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల, అభ్యర్థులు జూన్ 23వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

ఏఎన్‌ఎం పోస్టులకు..

జిల్లాలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ పాఠశాలలు, ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ వసతి గృహాల్లో 2023–24 విద్యా సంవత్సరానికి ఔట్ సోర్సింగ్ పద్ధతుల్లో ఏఎన్‌ఎంలుగా విధులు నిర్వహించుటకు గాను అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి పిరంగి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు జూలై 13లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయం (9100325335)లో సంప్రదించాలన్నారు.

ఫైర్‌స్టేషన్ తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న డీఎఫ్ఓ గౌతమ్

పెద్దశంకరంపేట(మెదక్): పెద్దశంకరంపేట ఫైర్‌స్టేషన్‌ను మంగళవారం జిల్లా ఫైర్ అధికారి గౌతమ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో రికార్డులు పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉండొద్దని సూచించారు. జిల్లాలోని అన్ని ఫైర్‌స్టేషన్‌లో తనిఖీలు చేపట్టి వసతులు, కావలసిన సౌకర్యాలపై ఉన్నతాధికారులకు నివేదిక అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పేట ఫైర్‌స్టేషన్ అధికారి శ్రీశైలం తదితరులున్నారు.

ఉపాధ్యాయుల కొరత తీర్చాలి

రేగోడ్(మెదక్): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీర్చాలని పీఆర్టీయూ మండల అధ్యక్షుడు అంజుబాబు కోరారు. మంగళవారం మెదక్‌లో పీఆర్టీయూ నాయకులతో కలిసి డీఈఓ రాధాకిషన్‌కు వినతిపత్రం అందజేశారు. మండలంలో 21 ప్రాథమిక పాఠశాలలు ఉండగా అందులో 13 ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయని, లింగంపల్లి, జగిర్యాల, గజ్వాడ పాఠశాలలో సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయుల కొరత ఉందన్నారు. స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట పీఆర్టీయూ జిల్లా బాధ్యులు తదితరులు ఉన్నారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

పెద్దశంకరంపేట(మెదక్): పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు కోరారు. సమస్యల పరిష్కారం కోసం జూలై 6 నుంచి చేపట్టనున్న సమ్మె నోటీసును మంగళవారం ఎంపీడీఓ రఫీఖ్ ఉన్నీసాకు అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సమ్మ మాట్లాడుతూ.. ప్రభుత్వం పంచాయతీ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, కనీస వేతనం రూ.19 వేలకు పెంచాలని, మల్టీపర్పస్ విధానం రద్దు, రూ.10 లక్షల బీమా, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు.

ఆకర్షణీయమైన ప్యాకెట్‌లు చూసి మోసపోవద్దు

- ధర అధికంగా ఉంటే నాణ్యమైనవి అనుకోవద్దు
- జూలై 20 వరకు పత్తి విత్తుకోవచ్చు
- నూనె పంటలకు అధిక డిమాండ్
- ఫోన్ ఇన్‌లో జిల్లా వ్యవసాయాధికారి



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): చూడగానే ఆకర్షించే విధంగా, అందమైన చిత్రాలతో ఆకట్టుకునే విధంగా ఉండే విత్తనాల ప్యాకెట్లను చూసి రైతులు మోసపోవద్దని జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్ అన్నారు. వానాకాలం సాగు సీజన్ ప్రారంభం అయిన నేపథ్యంలో సాక్షి ఆధ్వర్యంలో మంగళవారం మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు జిల్లా వ్యవసాయాధికారితో ఫోన్ ఇన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన అనేక మంది రైతులు ఫోన్ చేసి విత్తనాల ఎంపిక, నకిలీ విత్తనాలను గుర్తుపట్టడం, ఎరువుల యాజమాన్యం, పంట దిగుబడి, ఆయిల్ పామ్ సాగు, ప్రభుత్వ సహాయం, వర్ష ప్రభావం, తదితర అంశాలపై అధికారి నుంచి సలహాలు, సూచనలు పొందారు. రైతులు అడిగిన ముఖ్యమైన (కొన్ని మాత్రమే) సందేహాలను అధికారి నివృత్తి చేశారు.

ఆలస్యంగా వర్షాకాలం ప్రారంభం అయ్యింది. ఇప్పుడు ఏ పంట సాగు చేస్తే బాగుంటుంది?

–వీరయ్య, వల్లంపట్ల, స్వామి, వర్గల్

శివప్రసాద్ : జిల్లాలో నైరుతి రుతుపవనాలు కాస్త ఆలస్యంగానే ప్రవేశించాయి. అందువల్ల రైతులు సాగునీటి సౌకర్యం ఉన్న వారు వరిని, పత్తిని జూలై 20వరకు, మొక్కజొన్నను జూలై 15 వరకు విత్తుకోవచ్చు. ఈ వానా కాలం సాధారణం కంటే తక్కువ వర్షాలు పడే అవకాశం ఉంటుందని వాతావరణశాఖ అధికారులు పేర్కొన్నారు. అందువల్ల నీటిని తక్కువగా ఉపయోగించే పత్తి, ఇతర నూనె గింజల పంటలు సాగు చేయడం ఉత్తమం

వెద సాగు ఏవిధంగా చేస్తే లాభదాయకంగా ఉంటుంది? ఏ వంగడాలను వాడాలి?

–వెంకటేశం, రాఘవాపూర్

శివప్రసాద్ : వెద సాగు పద్ధతిలో వరి పంటను సాగు చేయడంతో పంట పెట్టుబడి, పంట సాగు సమయం తగ్గుతుంది. ఇప్పటికే సాగు చేయడం ఆలస్యం అవుతుంది. అందువలన స్వల్పకాలిక (125 రోజులు), మధ్యకాలిక(135 రోజులు) వంగడాలను సాగు చేయాలి. ముఖ్యంగా ఆర్‌ఎన్‌ఆర్ 1058, కేఎన్‌ఎం1630, తెలంగాణ సోన రకాల విత్తనాలను ఎంపిక చేసుకోవాలి.

భూసార పరీక్షలు చేయడం ద్వారా రైతులకు ఏమైనా ఉపయోగం ఉంటుందా? భూసార పరీక్షలు ఎప్పుడు నిర్వహిస్తారు ?

–అరవింద్, చింతమడక

శివప్రసాద్ : భూసార పరీక్షలు నిర్వహించడం వలన భూమిలో ఉండే లవణాల శాతం, ఏ పంటకు అనుకూలంగా ఉంటుందో, భూసారం కోసం ఏ ఎరువులు వాడాలో తదితర పూర్తి సమాచారం తెలుస్తుంది. అందువలన భూసార పరీక్షలతో రైతులకు అనేక విధాలుగా లబ్ధి చేకురుతుంది. ఈ భూసార పరీక్షలు త్వరలోనే 20క్లస్టర్‌లలో నిర్వహించనున్నాం.

వరిలో ఏ వంగడాన్ని ఎంచుకుంటే మంచిది. వరి కొయ్యలను కాల్చితే మంచిదా, కాల్చకుండా అలానే సేద్యం చేస్తే మంచిదా?

–శ్రీధర్, పొట్లపల్లి; రాజు, దుబ్బాక

శివప్రసాద్ : వరిలో ముఖ్యంగా మధ్యకాలిక, స్వల్పకాలిక రకం వంగడాలను ఎంపిక చేసుకోవాలి. దీంతో సాగు సమయం తగ్గుతుంది. నీటి వినియోగం తగ్గుతుంది. అందువలన కేఎన్‌ఎం118, ఎంటీయూ1010, జేజీఎల్24423, తెలంగాణ సోన, కూనారం సన్నాలు, వరంగల్ 962 వాటిని ఎంపిక చేసుకోవడం ఉత్తమం. వరి పంటను కోశాక వరి కొయ్యాలను తగలపెట్టడం వలన భూమిలో పంటలకు లాభం చేసే మిత్ర పురుగులు నశించిపోతాయి. అందువలన వరి కొయ్యాలను నీరు పెట్టి కలియ దున్నడంతో భూమి సారవంతంగా తయారవుతుంది. వాతావరణ కాలుష్యం తగ్గుతుంది.

పత్తి విత్తనాలు ఏ సమయం వరకు, ఎలాంటి విత్తనాలు విత్తాలి, భూమిలో తడి ఎంత ఉండాలి?

–అజ్జు యాదవ్, చెర్లఅంకిరెడ్డిపల్లి; దేవరాజు, రాఘవాపూర్

శివప్రసాద్ : పత్తిని జూలై 20 వరకు నాటుకోవచ్చు. భూమిలో 60 నుంచి 70మిల్లిమీటర్ల వరకు తడి ఉండాలి. ఇప్పుడు అన్ని రకాలుగా అనుకూలమైన వాతావరణం ఉంది. ఆకర్షణీయమైన ప్యాకెట్‌లలో, అధిక ధరలకు ఉన్న విత్తానాలే నాణ్యమైనవిగా రైతులు భావించి, సాగు చేసి నష్టపోతున్నారు. అందువలన లైసెన్స్ కల్గిన డీలర్ల నుంచి మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలి. గడువు సమయం, లాట్ నంబర్‌ను చూడాలి. తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలి. పంట సాగు పూర్తయ్యే వరకు బిల్లుతో పాటుగా, విత్తన ప్యాకెట్‌ను భద్రపర్చుకోవాలి. ఇది రైతులకు ఉపయోగపడుతుంది.

నారుమడిని ఏ విధంగా తయారు చేసుకుంటే నారు నాణ్యంగా ఉంటుంది?

–గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, పుల్లూరు

అధికారి వివరణ: వరి సాగులో నారుమడి కీలకంగా ఉంటుంది. అందువలన అనేక మెలుకువలు, జాగ్రత్తలు నారుమడి తయారులో తీసుకోవాలి. ముఖ్యంగా నాణ్యమైన వరి వంగడాలను ఎంచుకోవాలి. వరి విత్తనాలను శుద్ధి చేసుకోవాలి. నారుమడి చుట్టు కాలువలు తీయడం వలన వర్షం నీరు, అధిక నీరు ఈ మడిలోకి రాకుండా జాగ్రత్తపడొచ్చు. నారుమడిలో పిలకల తోకలు తొలగించడం వలన వరి పిలకలు బలవంతంగా తయారవుతాయి. సస్యరక్షణ, పంట యాజమాన్య పద్ధతులు పాటించడం వలన నారుమడి నాణ్యంగా ఉంటుంది.

వడగండ్లతో నష్టపోయిన రైతులకు పరిహారం ఎప్పుడు అందిస్తారు?

–జోగయ్య, దుబ్బాక; లింగయ్య, సారంపల్లి

అధికారి వివరణ: మార్చి15 లోపు జిల్లాలో 1145 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. ఈ నష్టపోయిన రైతులు ఖాతాల్లో డబ్బులు జమ అయ్యాయి. మార్చి 15 నుంచి ఏప్రిల్ 20 వరకు జిల్లాలో భారీ ఎత్తున వడగండ్ల వర్షాలు కురిశాయి, దీంతో 51 వేల ఎకరాల వరకు నష్టం వాటిల్లింది. ఈ నష్టవివరాలను క్షేత్ర స్థాయిలో వ్యవసాయాధికారులు పర్యటించి నివేదిక రూపొందించి, ప్రభుత్వానికి అందించారు. ప్రభుత్వం నుంచే నేరుగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయి.

వరికి బదులుగా ఇతర ఏ పంటలు సాగు చేస్తే రైతులకు ప్రయోజనం కల్గుతుంది ?

–షాదుల్లాగౌడ్, నెంటూరు

శివప్రసాద్ : జిల్లాలో సాగునీటి వనరులు అధికంగా ఉండటం వలన వరిని రైతులు సాగు చేస్తున్నారు. వరికి బధులుగా ఆయిల్ పాం, మల్బరి, నూనె గింజల పంటలు, ఇతర పండ్ల తోటలు సాగు చేయడం వలన రైతులు తక్కువ పెట్టుబడితో అధిక లభం పొందే అవకాశం ఉంటుంది. ఆయిల్ పాంలో, మల్బరీ, పండ్ల తోటలలో అంతర పంటలు వేసుకునే అవకాశాలు ఉంటాయి. దీంతో రెండు పంటలను ఏకకాలంలో పొందే అవకాశం ఉంటుంది. వీటికి నీటి వినియోగం తక్కువగా ఉంటుంది. అందులన వర్షాభావ పరిస్థితుల్లోను రైతులకు దిగుబడిని అందిస్తాయి. ప్రపంచంలో నూనెకు అధిక డిమాండ్ ఉంది. అందువలన నూనె గింజల సాగు చేయడం ద్వారా లబ్ధి పొందే అవకాశం ఉంది.

ఆరోగ్య సంరక్షణకు రుతుప్రేమ

జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ



అల్లీపూర్‌లో క్లాత్ ప్యాడ్స్ పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

చిన్నకోడూరు(సిద్దిపేట): మహిళల ఆరోగ్య సంరక్షణకు రుతుప్రేమపై ప్రతీ మహిళకు అవగాహన కల్పించాలని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మైలారం, అల్లీపూర్, కిష్టాపూర్ గ్రామాల్లో రుతుప్రేమపై అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళలకు క్లాత్ ప్యాడ్స్, సిలికాన్ కప్పు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శానిటరీ ప్యాడ్స్‌కు బదులుగా పర్యావరణ హితమైన శానిటరీ కప్పులు, క్లాత్ ప్యాడ్స్ ఉపయోగించాలని మహిళలకు సూచించారు. ఈ కప్పుల వాడకంతో ఆర్థిక భారం తగ్గడంతో పాటు పర్యావరణానికి జరుగుతున్న నష్టాన్ని తగ్గించొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఓ దేవకీ దేవి, డాక్టర్ శాంతి, ఏఎంసీ చైర్మన్ కొండం వనిత, ఎంపీపీ ఉపాధ్యక్షుడు పాపయ్య, సర్పంచ్‌లు, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ సోమిరెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎంసెట్ కౌన్సెలింగ్

నంగునూరు(సిద్దిపేట): ఇంజనీరింగ్ కళాశాలలో ప్రవేశం కోసం బుధవారం నుంచి రాజగోపాల్‌పేట పాలిటెక్నిక్ కళాశాలలో ఎంసెట్ కౌన్సెలింగ్ ప్రారంభమౌతుందని ప్రిన్సిపాల్ సూర్యనారాయణ తెలిపారు. మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఈ నెల 28 నుంచి జూలై 3 వరకు సర్టిఫికేట్లను పరిశీలించి విద్యార్థులకు ఐడి పాస్‌వర్డు అందజేస్తామన్నారు. జూలై 1న గ్రూపు 4 పరీక్ష ఉన్నందునా కౌన్సెలింగ్ ఉండదన్నారు. జిల్లా వ్యాప్తంగా ఒకే సెంటర్‌లో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నందునా విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని కట్టడి చేద్దాం



చిన్నకోడూరులో ప్లాస్టిక్ వస్తువుల అనర్థాలపై మాట్లాడుతున్న డీపీఓ దేవకీ దేవి

డీపీఓ దేవకీ దేవి

చిన్నకోడూరు(సిద్దిపేట): ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా కట్టడి చేయాలని డీపీఓ దేవకీ దేవి అన్నారు. మంగళవారం చిన్నకోడూరులోని హోటళ్లలో, కిరాణ, తదితర షాపుల్లో తనిఖీలు చేపట్టారు. అలాగే రోడ్ల పక్కన ఉన్న చెత్తాచెదారం తొలగించారు. ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి కలిగే అనర్థాలు, ప్రజల ఆరోగ్యానికి కలిగే ఇబ్బందులను వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ శాంతితో కలిసి మాట్లాడారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే రోగాల బారిన పడకుండా ఉండొచ్చని చెప్పారు. ఇంటి పరిసరాల్లో నీరు నిలిచి మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందునా పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాణిక్యరెడ్డి, సర్పంచ్ ఉమేష్ చంద్ర, ఎంపీటీసీ శారద, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ సోమిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్‌లు పాల్గొన్నారు.

జగదేవ్‌పూర్‌లో..

జగదేవ్‌పూర్(గజ్వేల్): కొండపోచమ్మ ఆలయం వద్ద మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల కార్యదర్శులు, మండల శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఓ దేవికీదేవి మాట్లాడుతూ జగదేవ్‌పూర్ మండలం ప్లాస్టిక్ రహిత మండలంగా తీర్చిదిద్దాలని సూచించారు. ముఖ్యంగా కొండపోచమ్మ ఆలయం వద్ద ప్లాస్టిక్ నిర్మూలన చేపట్టాలని, అమ్మవారి ప్రసాదం కోసం జ్యూట్ బ్యాగులు వాడాలని కోరారు. అలాగే ఆలయం వద్ద ఉన్న అన్ని వ్యాపార, కిరాణ దుకాణాల నిర్వాహకులు ప్లాస్టిక్ కవర్లను వాడోద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీఓ వేదావతి, ఎంపీడీఓ శ్రీనివాస్, సర్పంచ్ రజితరమేష్ పాల్గొన్నారు.



కొండపోచమ్మ ఆలయం వద్ద ప్లాస్టిక్‌పై అవగాహన కల్పిస్తున్న డీపీఓ దేవకీదేవి

మత్స్యకారులు సభ్యత్వ నమోదు చేసుకోవాలి

హుస్నాబాద్‌రూరల్: మత్స్యకారులు సభ్యత్వ నమోదు చేసుకోవాలని డీఎఫ్ఓ మల్లేశం అన్నారు. మంగళవారం మహ్మదాపూర్ గ్రామంలో మత్స్యకారులకు స్కిల్ టెస్టు నిర్వహించి కోఆపరేటివ్ అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సహకార సంఘంలో సభ్యత్వం నమోదు చేశారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ మత్స్యకారులు సొసైటీలో సభ్యత్వం పొందితేనే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని చెప్పారు. మత్స్యకారులకు ప్రభుత్వం సబ్సిడీపై వాహనలను మంజూరు చేస్తుందని, ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తుందని, చేపల పెంపకానికి చెరువుల నిర్వహణకు రుణాలను ఇస్తుందని చెప్పారు. వ్యవసాయ అనుబంధంగా చేపల పెంపకాన్ని చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పిట్టల బాలయ్య, బొల్లి రాంచంద్రం పాల్గొన్నారు.



మత్స్యకారులకు సభ్యత్వం అందిస్తున్న డీఎఫ్ఓ మల్లేశం

ప్రజా సంక్షేమమే బీజేపీ ధ్యేయం



మాట్లాడుతున్న మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి

- మహబూబ్‌నగర్ మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి
- గజ్వేల్‌లో విజయ సంకల్ప సభ

గజ్వేల్‌రూరల్: మాయమాటలతో మభ్యపెట్టే వారిని నమ్మొద్దని, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న బీజేపీని గెలిపించాలని మహబూబ్‌నగర్ మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మహజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా గజ్వేల్ పట్టణంలోని ప్రజ్ఞా గార్డెన్స్‌లో మంగళవారం విజయ సంకల్ప సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తన సొంత నియోజకవర్గంలో ప్రజా సమస్యలను పట్టించుకోని సీఎం కేసీఆర్ మహారాష్ట్రలో ఏం ఒరగబెడతారని ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదని విమర్శించారు. కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ హయాంలో 9ఏళ్ల పాలనలో దేశం అభివృద్ధిలో దూసుకుపోతుందని పేర్కొన్నారు. కరోనా కష్టకాలం నుంచి ఇప్పటి వరకు ఉచితంగా రేషన్ బియ్యం అందిస్తున్న ఘనత బీజేపీకే దక్కుతుందన్నారు. కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా రైతులకు రూ.6వేల ఆర్థికసాయం అందిస్తున్నట్లు గుర్తు చేశారు. ప్రజల బతుకులు బాగుపడాలంటే రాబోవు ఎన్నికల్లో బీజేపీకే ఓటు వేయాలన్నారు. బీజేపీ గెలుపు గజ్వేల్ నుంచే ప్రారంభం కావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట, మెదక్ జిల్లాల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, గడ్డం శ్రీనివాస్, సిద్దిపేట జిల్లా ఇన్‌చార్జి అంజన్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర ఐటీసెల్ కన్వీనర్ వెంకటరమణ, మెదక్ పార్లమెంట్ కన్వీనర్ రామ్మోహన్‌గౌడ్, నాయకులు కప్పర ప్రసాదరావు, ఎల్లు రాంరెడ్డి, పేర్ల శ్రీనివాస్, కుడిక్యాల రాములు, గురువారెడ్డి, నలగామ శ్రీనివాస్, నందన్‌గౌడ్, సాయిబాబా, మహేష్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పక్కనే చెత్త డంప్



రోడ్డు పక్కన పడేసిన చెత్త

- దుర్వాసనతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి
- పట్టించుకోని అధికారులు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయం ఎదురుగా ఉన్న రోడ్డు పక్కనే చెత్త డంప్‌తో ప్రయాణికులు, సమీప రైతులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డంప్ నుంచి వస్తున్న దుర్వాసనతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ రోడ్డుపై నుంచే ప్రజాపరిషత్ కార్యాలయం అధికారులు, ప్రజాప్రతినిధులు రాకపోకలను సాగిస్తుంటారు. కాగా చెత్త డంప్‌లో నుంచి వచ్చే దుర్వాసనను భరించలేకపోతున్నామని ప్రజలు వాపోతున్నారు. ప్లాస్టిక్ కవర్లు, ఖాళీ సంచులు, బిస్కెట్ కవర్లు వేయడంతో చెత్త కుప్పగా పేరుకుపోయింది. దీనికి తోడుగా వరుసగా కురుస్తున్న చిన్నపాటి వర్షాలకు డంప్‌లోంచి భరించలేని స్థాయిలో దుర్వాసన వెదజల్లుతోందని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి చెత్తచెదారాలను తొలగించి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

జీరో దందా..!


- ప్రభుత్వ ఆదాయానికి గండి
- నోట్ బుక్స్‌కు 12శాతం, స్టేషనరీకి 18శాతం వసూలు
- జీఎస్టీ చెల్లించకుండా వ్యాపారం
- పట్టించుకోని వాణిజ్య పన్నుల శాఖ

సాక్షి, సిద్దిపేట: ఓ ప్రైవేట్ ఉద్యోగి కుమారుడు ఓ ప్రైవేట్ పాఠశాలలో 3వ తరగతి చదువుతున్నాడు. ఓ బుక్ స్టాల్‌లో నోట్ బుక్స్, పుస్తకాలు, స్టేషనరిని రూ.4,900 పెట్టి కొనుగోలు చేశాడు. బిల్లును తెల్ల కాగితంపై రాసి ఇచ్చాడు. బుక్ స్టాల్ పేరు మీద బిల్లు ఇవ్వండని బుక్ స్టాల్ నిర్వాహకుడిని కోరారు. జీఎస్టీ చెల్లిస్తే బిల్లు ఇస్తా అని చెప్పాడు. దీంతో ఎందుకులే అని ఆ ఉద్యోగి వెళ్లిపోయాడు. ఇలా ప్రతీ బుక్ స్టాల్‌లో తెల్ల కాగితం పైనే రాసి ఇస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుంది. బుక్ స్టాల్‌ల్లో వ్యాపారం జరిగేది కోట్లలో....చూపించేది మాత్రం రూ.15 నుంచి రూ.18లక్షలు జరుగుతుందని జీఎస్టీ లైసెన్స్ తీసుకోకుండానే వ్యాపారం చేస్తున్నారు. ప్రతీ యేడాది విద్యా సంవత్సరం ప్రారంభంలో నోట్ బుక్స్, స్టేషనరిని కొనుగోలు చేస్తారు. వినియోగదారులకు బిల్లులు ఇవ్వడకుండా బుక్ స్టాల్ నిర్వాహకులు జీరో దందాకు తెరలేపుతున్నారు.

తెల్ల కాగితమే బిల్లు..

ప్రతీ యేడాది రూ.20లక్షల కంటే ఎక్కువ వ్యాపారం జరిగితే తప్పక జీఎస్టీ లైసెన్స్‌ను వ్యాపారి తీసుకోవాలి. విక్రయించిన ప్రతీ వస్తువుకు బిల్లును వినియోగదారునికి అందించాలి. ఆ బిల్లుపై జీఎస్టీ నంబర్, బిల్‌పై వరుస సంఖ్య ఉండాలి. బిల్లును కార్బన్ పేపర్ పెట్టి రాయాలి. ఒరిజినల్ బిల్లు వినియోగదారునికి, మరో బిల్లు షాప్‌లో బిల్ బుక్‌తోనే ఉండాలి.

- బుక్ స్టాల్‌ల్లో నోట్ బుక్‌లకు 12శాతం జీఎస్టీని, స్టేషనరీకి 12 నుంచి 18శాతం జీఎస్టీ చెల్లించాలి.
- జిల్లాలో సుమారుగా 100కు పైగా బుక్ స్టాల్స్ ఉంటాయి. ప్రతీ యేడాది రూ.కోట్లలో వ్యాపారం జరుగుతుంది. కానీ ఎక్కువ సంఖ్యలో బుక్ స్టాల్ నిర్వాహకులు తమ వ్యాపారం రూ.20లక్షల లోపే జరుగుతుందని జీఎస్టీ పరిధిలోకి రావడం లేదు. దీంతో వాణిజ్య పన్నుల శాఖకు జీఎస్టీ చెల్లింపులు జరగడం లేదు.
- వినియోగదారుని దగ్గర నుంచి వ్యాపారులు జీఎస్టీ వసూలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వానికి మాత్రం జీఎస్టీ చెల్లించడం లేదు. బిల్లులు ఇవ్వకుండా వ్యాపారులు అడ్డదారులు తొక్కుతున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి పెద్ద మొత్తంలో రాబడి తగ్గుతుంది.
- నోట్ బుక్‌లు, స్టేషనరిలు కొనుగోలు చేసినా వారికి బిల్లులు ఇవ్వకుండా జీరో దందా చేస్తున్న వాణిజ్య పన్నుల శాఖ అధికారులు ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదు. ఆ వైపుగా చూడడమే లేదు. వాణిజ్య పన్నుల శాఖ అధికారులు తనిఖీలు చేయకపోవడంతో వ్యాపారులు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి జీరో దందాకు అడ్డుకట్టవేయాలని ప్రజలు కోరుతున్నారు.



సిద్దిపేటలోని ఓ బుక్ స్టాల్‌లో కొనుగోలు చేసిన వాటికి ఇచ్చిన బిల్లు

> **మా దృష్టికి రాలేదు..**
>
> బుక్ స్టాల్‌ల్లో కొనుగోలు చేసిన వారికి బిల్లులు ఇవ్వడం లేదని మా దృష్టికి రాలేదు. ప్రతి కొనుగోలుపై వినియోగదారునికి బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలి. – మీనాకుమారి, సీటీఓ

క్లుప్తంగా

డ్రంకెన్ డ్రైవ్‌లో 17మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: ఇటీవల పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు మంగళవారం సంగారెడ్డి కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గత ఆది, సోమవారాల్లో నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో 17మందిని అదుపులోకి తీసుకున్నట్టు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి 17 మందికి ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు.

తప్పిన పెను ప్రమాదం

నారాయణఖేడ్: ఇసుక లోడుతో వెళ్తున్న లారీ టైరు అకస్మాత్తుగా పేలడంతో త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం నిజాంపేట్ వైపు నుంచి నారాయణఖేడ్ వైపునకు ఇసుక లోడుతో వస్తున్న లారీ వెంకటాపూర్ చౌరస్తా వద్దకు రాగానే లారీ ముందు టైరు పేలింది. దీంతో లారీ అదుపుతప్పి పక్కకు ఆగడంతో పెను ప్రమాదం తప్పింది. టైరు పేలిన కారణంగా రహదారిపై లారీ నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. దీంతో వాహనదారులు రెండు గంటల పాటు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

పోక్సో కేసులో జైలు

సిద్దిపేటకమాన్: నేరం రుజువు కావడంతో పోక్సో కేసులో ఓ వృద్ధుడు జైలు పాలయ్యాడు. ఏసీపీ దేవారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట పరిధిలోని గాడిచర్లపల్లి గ్రామానికి చెందిన అక్కరాజుల మల్లయ్య (70) సిద్దిపేట మండలానికి చెందిన ఏడు సంవత్సరాల పాపను 2018 సెప్టెంబర్ 17వ తేదీన శారీరకంగా హింసించడంతో పాటు అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో పాప తల్లి ఫిర్యాదు మేరకు అప్పటి వన్‌టౌన్ సీఐ నందీశ్వర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. అప్పటి ఏసీపీ రామేశ్వర్ కేసు తదుపరి పరిశోధన పూర్తి చేసిన అనంతరం రిమాండ్‌కు తరలించారు. సిద్దిపేట కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. అనంతరం ఇద్దరివాదనలు విన్న తర్వాత నేరం రుజువు కావడంతో మంగళవారం సిద్దిపేట అడిషనల్ డిస్ట్రిక్ సెషన్స్ న్యాయమూర్తి నేరస్తుడికి రూ.5వేల జరిమానాతో పాటు 7 సంవత్సరాల కఠిన కారాగార జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

క్రెడిట్ కార్డు నుంచి రూ.3.50 లక్షలు స్వాహా

పటాన్‌చెరు టౌన్: సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని క్రెడిట్ కార్డు నుంచి రూ.3.50 లక్షలను సైబర్ నేరగాళ్లు కాజేసిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అమీన్‌పూర్ పరిధిలోని లక్ష్మిహోమ్స్‌కు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగినికి చెందిన క్రెడిట్ కార్డు నుంచి ఏప్రిల్ 22వ తేదీన సైబర్ నేరగాళ్లు పలు దఫాలుగా రూ.3.50 లక్షలు కాజేశారు. గమనించిన ఉద్యోగిని ముందుగా సైబర్ క్రైంలో ఫిర్యాదు చేసింది. అనంతరం మంగళవారం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

దేవాలయంలో చోరీ



కొండపాక(గజ్వేల్): దండు మైసమ్మ తల్లి దేవాలయంలో చోరీ జరిగింది. ఎస్‌ఐ పుష్పరాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. లకుడారం గ్రామ శివారులోని దండు మైసమ్మ తల్లి దేవాలయంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు హుండీ పగులగొట్టి నగదు అపహరించారు. గమనించిన పూజారి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సర్పంచ్ టు రాజ్యసభ

70 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో రామచంద్రారెడ్డిని వరించిన ఎన్నో పదవులు



సోలిపేట రామచంద్రారెడ్డి (ఫైల్)

దుబ్బాకటౌన్: తొలితరం కమ్యూనిస్టునేతగా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన సోలిపేట రామచంద్రారెడ్డిని 70 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎన్నో పదవులు వరించాయి. మట్టిమనుషులతో కలిసి తిరిగిన జమీన్ లీడర్‌గా ఆయనకు గుర్తింపు ఉంది. ప్రజల మేలు కోసం పరితపించే సిసలైన నాయకుడు. స్థానిక సంస్థల దగ్గరి నుంచి విదేశీ విధానాల వరకు ప్రత్యక్ష అవగాహన కలిగిన నేతగా పేరుంది. ఇప్పుడు గొప్పగా చెప్పకుంటున్న అనేక అభివృద్ధి కార్యక్రమాలు, నూతనచట్టాలపై కొన్ని దశాబ్దాల క్రితమే రామచంద్రారెడ్డి ఎలుగెత్తి చాటిన విషయం చాలా తక్కువమందికి మాత్రమే తెలుసు. **రామచంద్రారెడ్డి అనారోగ్యంతో హైదరాబాద్‌లో మంగళవారం ఉదయం మృతి చెందారు.** దీంతో ఆయన స్వగ్రామమైన చిట్టాపూర్‌తోపాటు, ఉమ్మడి మెదక్ జిల్లాలో విషాదఛాయలు అలుముకున్నాయి.

- ఎమ్మెల్యేగా పనిచేసే కాలంలోనే రామచంద్రారెడ్డి దొమ్మాట నియోజకవర్గపరిధిలో వ్యవసాయం, రోడ్ల అభివృద్ధికి విశేష కృషి చేశారు. రాజ్యసభ సభ్యుడిగా కూడవెల్లివాగుపై చెక్‌డ్యాంలు నిర్మించేందుకు పెద్దఎత్తున నిధులు మంజూరు చేయించారు.
- రామచంద్రారెడ్డి వాలీబాల్ ప్లేయర్. బాల్యంలో తోటి స్నేహితులతో కలిసి వాలీబాల్ బాగా ఆడేవారని చిట్టాపూర్‌వాసులు గుర్తుచేసుకుంటున్నారు.
- పుస్తక పఠనం ఆయనకు ఎంతో ఇష్టం. వారంలో నాలుగు రోజులు లైబ్రరీలో గడిపేవారు. ఎనిమిదిపదుల వయస్సులోనూ రోజు నాలుగైదు దినపత్రికలు చదివేవారు. సాహిత్య కార్య క్రమాలకు ఎవరు ఆహ్వానించినా తప్పకుండా వెళ్లేవారు.



మాజీ సీఎం చెన్నారెడ్డితో దుబ్బాక పర్యటనలో

సొంతూరి నుంచే...

దుబ్బాక మండలం చిట్టాపూర్‌లో మాలిపటేల్ సోలిపేట గాలిరెడ్డి- సుందరమ్మ దంపతులకు 1935లో రామచంద్రారెడ్డి జన్మించారు. సొంతూరిలోనే ప్రాథమిక విద్య పూర్తి చేశారు. ఆపై సిద్దిపేటలో పదోతరగతి వరకు చదివారు. ఇంటర్, డిగ్రీ హైదరాబాద్ సిటీకాలేజీలో చదివారు. ఈ సమయంలోనే 1951లో సిటీ కాలేజీకి స్టూడెంట్ యూనియన్ అధ్యక్షుడిగా గెలుపొందారు. అప్పుడే జరిగిన పరిణామాలతో అతడిలో కమ్యూనిజం బీజాలు మొలకెత్తాయి. దీంతో చదువుకు స్వస్తి చెప్పి స్వగ్రామానికి వచ్చాడు.

- చిట్టాపూర్ మొట్టమొదటిసర్పంచ్‌గా 1955లో ఎన్నికై 1964 వరకు అదే పదవిలో కొనసాగారు.

కేసీఆర్‌కు రాజకీయగురువు

ప్రస్తుత సీఎం కేసీఆర్‌కు రామచంద్రారెడ్డి రాజకీయ గురువు. సీఎం స్వగ్రామమైన చింతమడక దుబ్బాక సమితి పరిధిలోనే ఉండేది. సమితి ప్రెసిడెంట్ నుంచి ఎమ్మెల్యేగా రామచంద్రారెడ్డి గెలుపొందినప్పటి నుంచి కేసీఆర్ తరచు కలిసేవారు. 1988లో టీడీపీ నాయకులకు రామచంద్రారెడ్డి నేతృత్వంలో రాజకీయ శిక్షణ తరగతులు జరిగాయి.

- దివంగత ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డికి రామచంద్రారెడ్డి వరుసకు సోదరుడు అవుతాడు. రామలింగారెడ్డి, రామచంద్రారెడ్డిల తాతలు అన్నదమ్ముళ్లు. రామలింగారెడ్డి మృతి చెందినప్పుడు చిట్టాపూర్‌కు వచ్చి రామచంద్రారెడ్డి కంటతడి పెట్టారు.

- 1964 నుంచి దుబ్బాక సమితి ప్రెసిడెంట్‌గా, 1970–72 వరకు సిద్దిపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పనిచేశారు.
- 1972లో దొమ్మాట అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి కాంగ్రెస్ తరపున ఎమ్మెల్యేగా గెలుపొందారు.
- 1978 నుంచి మెదక్ జిల్లా కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ చైర్మన్‌గా పనిచేశారు.
- 1988 –89లో ఎన్‌టీఆర్ ప్రభుత్వంలో ఏపీ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేశారు.
- 1996 నుంచి 2002 వరకు రాజ్యసభ సభ్యుడిగా, రాజ్యసభలో టీడీపీ ఫ్లోర్ లీడర్‌గా, రాజ్యసభ అస్సూరెన్స్ కమిటీ చైర్మన్‌గా పనిచేశారు.
- ఉమ్మడి మెదక్‌కు కాంగ్రెస్, టీడీపీల తరపున పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించారు.
- ఇండియా –చైనా మిత్రమండలి అసోసియేషన్ అధ్యక్షుడిగా పనిచేశారు.
- సీఆర్ ఫౌండేషన్ తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్టుతో ఇతర సంస్థలకు సభ్యుడిగా సేవలు అందించారు.
- లోక్‌సత్తాలో సైతం పనిచేసి అనేక ఉద్యమాలకు నేతృత్వం వహించారు.
- గత కొన్నేళ్లుగా ఆయన రాజకీయాలకు దూరంగా ఉన్నారు.
- మాజీ ప్రధాని ఇందిరాగాంధీతో మొదలుకొని, మాజీ సీఎంలు చెన్నారెడ్డి, ఎన్‌టీఆర్, చంద్రబాబుతో సన్నిహిత సంబంధాలు నెరిపారు.

నక్సల్స్ ఇంటిని పేల్చడంతో కలత

ప్రగతిశీల వామపక్ష భావాలతో ఉండే రామచంద్రారెడ్డి గ్రామంలోని దళితులు, వెనుకబడిన కులాల వారిని ఎంతగానో ప్రోత్సహించారు. గ్రామంలో సమానత్వం తీసుకొచ్చే సమయంలోనే నక్సలైట్ ఉద్యమం మొదలైంది. అప్పటికే జిల్లాలో చాలా నక్సలైట్ గ్రూపులు ఉండేవి. భూస్వాములు, రాజకీయ నేతలను టార్గెట్ చేసి వారి ఇళ్లు పేల్చేవారు. 1997లో రామచంద్రారెడ్డి పుట్టిపెరిగిన ఇంటిని నక్సలైట్లు పేల్చివేయడంతో తీవ్రంగా కలత చెందాడు. దీంతో కొంతకాలం ఆయన స్వగ్రామానికి వెళ్లేందుకు కూడా ఇష్టపడలేదు. నక్సలైట్ల దాడిలో ఇంట్లోని విలువైన ఫొటోలు, పుస్తకాలు, చిన్నతనంలోని జ్ఞాపకాలు కాలి బూడిద అయ్యాయని చాలా బాధపడ్డారు. పేదలు, ఎస్సీలు కోసం తనకున్న 20 ఎకరాలకు పైగా భూమి ఇస్తే.. నక్సల్స్ ఇలా చేస్తారా అని ప్రశ్నించారు. దీనికి అప్పుడు నక్సల్ వివరణ ఇస్తూ రామచంద్రారెడ్డి టీడీపీలో ఉన్నందునే ఇంటిని పేల్చామన్నారు.



కూడవెల్లి వాగుపై చెక్‌డ్యాం

సినారెతో బంధుత్వం

ప్రముఖకవి, రచయిత డాక్టర్ సి.నారాయణరెడ్డితో రామచంద్రారెడ్డికి దగ్గరి బంధుత్వం ఉంది. రామచంద్రారెడ్డి అమ్మమ్మ ఊరు మరిగడ్డ, సినారే స్వగ్రామం హన్మాజీపేట పక్క పక్క గ్రామాలే. ఇస్కస్ తదితర అభ్యుదయ సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా వీరిద్దరికి మంచి పరిచయం ఉంది. ఈ క్రమంలోనే 1986లో సినారే నాలుగో కుమార్తె కృష్ణవేణిని రామచందారెడ్డి పెద్ద కుమారుడు (రాష్ట్ర గ్రామీణ బ్యాంకుల అసోషియేషన్ అధ్యక్షుడు) వెంకటేశ్వర్‌రెడ్డికి ఇచ్చి వివాహం చేయడంతో ఇద్దరు వియ్యం అందుకున్నారు.1996 నుంచి 2002 వరకు రామచంద్రారెడ్డి, సినారె ఒకే సమయంలో రాజ్యసభ సభ్యులుగా కొనసాగడం మరో విశేషం.



సినారెతో రామచంద్రారెడ్డి (ఫైల్)

పార్సిల్ డెలివరీ పేరిట సైబర్ మోసం

సిద్దిపేటకమాన్: డ్రెస్ మెటిరీయల్ పార్సిల్ డెలివరీకి సంబంధించి ఫోన్‌కాల్‌కు స్పందించి గుర్తు తెలియని వ్యక్తికి డబ్బులు పంపించి ఒకరు మోసపోయారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత తెలిపిన వివరాల ప్రకారం..దుబ్బాక పీఎస్ పరిధిలో ఓ మహిళ ఇన్‌స్టాగాంలో డ్రెస్‌కు సంబంధించిన ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసింది. అనంతరం ఆమె వాట్సాప్ నంబరుకు గుర్తు తెలియని వ్యక్తి మెసేజ్ చేశాడు. ఆ ఆర్డర్‌కు సంబంధించిన డబ్బు చెల్లించాలని లేదంటే డ్రెస్ పార్శిల్ డెలివరీ చేయలేమని నమ్మబలికాడు. అది నమ్మిన బాధితురాలు గుర్తు తెలియని వ్యక్తి పంపిన నంబరుకు ఫోన్ పే, గూగుల్‌పే ద్వారా పలు దఫాలుగా రూ.80,893 పంపించింది. అనుమానంతో ఆ నంబరుకు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. ఇక చేసేదేమి లేక తను మోసపోయినట్టుగా గుర్తించింది. వెంటనే బాధితురాలు జాతీయ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు ఫిర్యాదు చేసింది.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

పెద్దశంకరంపేట(మెదక్): రెండు డీసీఎంలలో అక్రమంగా తరలిస్తున్న పశువులను పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే... జాతీయ రహదారిపై కోళపల్లి టోల్ గేట్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద సోమవారం రాత్రి పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్న సమయంలో నాందేడ్ నుంచి డీసీఎంలో 47 దూడలు, సిర్గాపూర్ నుంచి డీసీఎంలో 26 లేగదూడలను ఎలాంటి అనుమతులు లేకుండా హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో వాహనాలతో పాటు పశువులను స్వాధీనం చేసుకొని డ్రైవర్లు ఇర్ఫాన్‌ఖాన్, మహ్మద్‌లను అరెస్ట్ చేశారు. అనంతరం పశువులను టేక్మాల్ మండలం వెల్పుగొండలోని గోశాలకు తరలించారు. కేసు నమోదు చేసి వివరాలు సేకరిస్తున్నట్టు ఎస్‌ఐ బాలరాజు తెలిపారు.




పెద్దశంకరంపేటలో పోలీసులు స్వాధీనం చేసుకున్న పశువులు

మద్యం సేవించడానికి వచ్చి..

పటాన్‌చెరు టౌన్: మద్యం సేవించడానికి వచ్చి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ పాషా కథనం ప్రకారం...మధ్యప్రదేశ్‌కు చెందిన రిషి వీకే(40) ఆరునెలల క్రితం బతుకుదెరువు కోసం వచ్చి పటాన్‌చెరు మండలం పాటి గ్రామ సమీపంలోని ఓ నిర్మాణరంగ సంస్థ వద్ద కూలీ పని చేస్తున్నాడు ఈ క్రమంలోనే మద్యానికి బానిస అయిన రిషి వచ్చిన కూలి డబ్బులు తాగేందుకు ఖర్చు చేసేవాడు. సోమవారం మద్యం సేవించడానికి వెళ్లి, రామచంద్రాపురం పరిధిలోని వెలమెల చౌరస్తాలో ఓ షాపు ముందు గాయాలతో పడి ఉండడాన్ని మంగళవారం ఉదయం స్థానికులు, షాపు నిర్వాహకులు గుర్తించారు. వివరాలు అడగగా, చెప్పి మంచినీరు అడిగాడు. తాగిని కొద్దిసేపటికే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

డీసీఎం బోల్తా

తూప్రాన్: విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ఓ డీసీఎం బోల్తా పడింది. వివరాల్లోకి వెళితే...శివ్వంపేట మండలం శభాష్‌పల్లిలోని సుగుణ పరిశ్రమ నుంచి దాణా లోడుతో ఓ డీసీఎం కరీంనగర్‌కు బయలు దేరింది. తూప్రాన్‌లోని పోతరాజుపల్లి కమాన్ సమీపంలోకి చేరుకోగానే ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించపోయి డీసీఎం రహదారి కిందకు దూసుకెళ్లింది. ఈ క్రమంలోనే విద్యుత్ స్తంభాన్ని అతివేగంగా ఢీకొని బోల్తా పడింది. విద్యుత్ స్తంభం విరిగి తీగలు భూమిపై తెగి పడ్డాయి. ఈ ప్రమాదంలో డ్రైవర్ కృష్ణకు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ప్రమాదం జరిగిన సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.



రెండు బైక్‌లు ఢీ: ఒకరి మృతి

పాపన్నపేట(మెదక్): రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. ఎస్‌ఐ విజయకుమార్ తెలిపిన వివరాల ప్రకారం..తమ్మాయపల్లి గ్రామానికి చెందిన రైతు అంతటి దుర్గయ్య (50) ఆస్పత్రిలో ఉన్న తన బంధువులను పరామర్శించడానికి మెదక్ ఏరియా ఆస్పత్రికి సోమవారం వెళ్లాడు. అదే రోజు రాత్రి తిరిగి వస్తుండగా, యూసూఫ్‌పేట శివారులో ఎదురుగా వస్తున్న బైక్ దుర్గయ్య బైక్‌ను ఢీకొట్టింది. దీంతో రోడ్డుపై పడిన దుర్గయ్యకు తీవ్ర గాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం మెదక్ ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి కుమారుడు శ్యామ్ కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



దుర్గయ్య (ఫైల్)

దొంగతనం కేసులో ఇద్దరికి ఏడాది జైలు శిక్ష

కమ్మర్‌పల్లి/ఖలీల్‌వాడి: పలు గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనానికి పాల్పడిన ఇద్దరికి ఏడాది జైలు శిక్ష పడింది. ఈ కేసుకు సంబంధించి కమ్మర్‌పల్లి ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపిన ప్రకారం.. 2022 సంవత్సరం ఫిబ్రవరి, మార్చి నెలల్లో కమ్మర్‌పల్లి, మోర్తాడ్ మండలాల్లో నాలుగు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు దొంగతనానికి గురయ్యాయి. పోలీసులు విచారణ చేపట్టి కేసులో ఏపీలోని సింగరాయకొండకు చెందిన పల్లిపాటి ఏసుదాసు, మెదక్ జిల్లా చిన్న శంకరంపేట శాలిపేట గ్రామానికి చెందిన నర్రా శ్రీధర్‌లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి ట్రాన్స్‌ఫార్మర్లకు సంబంధించి 280 కిలోల కాపర్ వైర్‌ను స్వాధీనం చేసుకొని కేసు దర్యాప్తు చేశారు. అనంతరం ఆధారాలతో కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన ఆర్మూర్ ఏజేఎఫ్‌సీఎం కోర్టు మెజిస్ట్రేట్ వేముల దీప్తి మంగళవారం నిందితులిద్దరికి ఒక సంవత్సరం పాటు సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారు.

గొంతుకోసిన ఘటనలో ఒకరి అరెస్ట్

అక్కన్నపేట(హుస్నాబాద్): మత్తులో స్నేహితుడి గొంతు కోసిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ తాండ్ర వివేక్ తెలిపిన వివరాల ప్రకారం.. సంఘ విక్రమ్, నరసింహులిద్దరూ స్నేహితులుకాగా, జనగామ శివారులో తాగిన మత్తులో గొడవ పడడం విక్రమ్ గొంతు నరసింహ కోసిన విషయం తెలిసిందే. మంగళవారం మండలంలోని బొడిగేపల్లి స్టేజ్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న క్రమంలో అనుమానాస్పదంగా బైక్‌పై వెళుతుండగా, నరసింహను అదుపులోకి తీసుకున్నారు. అమ్మాయిల విషయంతో గొడవ జరిగి గొంతు కోశానని నిందితుడు ఒప్పుకోవడంతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడి బైక్‌ను సీజ్ చేశారు.

వేర్వేరు ఘటనల్లో ఐదుగురి అదృశ్యం

పెద్దశంకరంపేటలో వేర్వేరుచోట్ల ఇద్దరు, న్యాల్‌కల్‌లో ఇద్దరు, నారాయణఖేడ్‌లో మరొకరు అదృశ్యమయ్యారు.

టీవీ రీచార్జ్ కోసం వెళ్లి..



సాయబుగారి విఠల్ (ఫైల్)

పెద్దశంకరంపేట(మెదక్): ఎస్‌ఐ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని మల్కాపూర్‌కు చెందిన సాయబుగారి విఠల్ ఈ నెల 23వ తేదీన టీవీ రీచార్జ్ కోసం బైక్‌పై పెద్దశంకరంపేటకు వచ్చాడు. అప్పటి నుంచి ఇంటికి రాలేదు. ఫోన్ చేసినా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో విఠల్ తండ్రి లక్ష్మయ్య మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

పందులు పట్టడానికి వెళ్లి...



దేరంగుల కృష్ణ (ఫైల్)

పెద్దశంకరంపేట(మెదక్): ఎస్‌ఐ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం..పెద్దశంకరంపేటలోని వడ్డెరవాడకు చెందిన దేరంగుల కృష్ణ ఈ నెల 16వ తేదీన పందులు పట్టడానికి ఎరుకల రామయ్యతో కలిసి వెళ్లాడు. అప్పటి నుంచి ఇంటికి తిరిగి రాలేదు. ఈ విషయమై రామయ్యను ఆరా తీయగా, పందులు పట్టడానికి బెంగుళూరు వెళ్లామని, 18వ తేదీన ట్రైన్‌లో కృష్ణ హైదరాబాద్‌కు వెళ్లాడని చెప్పాడు. బంధువుల వద్ద ఆరా తీసినా ఏ ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో కృష్ణ భార్య స్వరూప మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

హాస్టల్లో ఉండి చదవడం ఇష్టం లేక...



ఓంకార్

నారాయణఖేడ్: ఎస్‌ఐ ఏడుకొండలు తెలిపిన వివరాల ప్రకారం.. కంగ్టి మండలంలోని చుక్కల్‌తీర్థ్ గ్రామానికి చెందిన కోలాబాస్ ఓంకార్(13) కోహీర్ మండల పరిధిలోని దిగ్వాల్ బీసీ హాస్టల్‌లో పదోతరగతి, జూకల్ శివారులోని ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో అతడి సోదరి డిగ్రీ చదువుతోంది. సోమవారం ఓంకార్‌ను తండ్రి సాయిగొండ హాస్టల్‌కు పంపించేందుకు ఖేడ్‌కు తీసుకొచ్చాడు. ముందుగా సోదరిని చూడటానికి తండ్రీకొడుకు కలిసి వెళ్లారు. ఈ క్రమంలోనే ఓంకార్ తండ్రి కళ్లుగప్పి కనిపించకుండా పోయాడు. హాస్టల్‌లో ఉంటూ చదడం ఇష్టం లేదని చెబుతుండేవాడని, అందువల్లే పారిపోయి ఉంటాడని సాయిగొండ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పనిపై బయటకు వెళ్లి...



నసీర్(ఫైల్)

న్యాల్‌కల్(జహీరాబాద్): హద్నూర్ ఎస్‌ఐ వినయ్‌కుమార్ కథనం ప్రకారం... మామిడ్గికి చెందిన నసీర్ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. ఈనెల 24న మధ్యాహ్నం ఇంటి నుంచి పని చేసేందుకు వెళ్లాడు. ఎంతకూ తిరిగి రాలేదు. చుట్టు పక్కల, బంధువుల వద్ద వెతికినా నసీర్ ఆచూకీ లభించలేదు. భార్య నజీం బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అమీన్‌పూర్‌కు వెళుతున్నానని చెప్పి..



సునీత(ఫైల్)

న్యాల్‌కల్‌కు చెందిన సునీతకు హుస్సేన్‌నగర్ గ్రామానికి చెందిన నర్సింహులుకు ఏడేళ్ల క్రితం వివాహం జరిగింది. దంపతులు అమీన్‌పూర్‌లో ఉంటున్నారు. వారికి ఇద్దరు పిల్లలు న్నారు. దంపతుల మధ్య డబ్బుల విషయంలో గొడవ జరిగింది. దీంతో సునీత ఇటీవల పిల్లలతో స్వగ్రామానికి వచ్చింది. సోమవారం ఉదయం దంపతులు చాల్కి చౌరస్తా వద్ద కలిశారు. పిల్లలను తీసుకొస్తానని నర్సింహులు న్యాల్‌కల్‌కు రాగా, సునీత అమీన్‌పూర్‌కు ఆటోలో బయలుదేరింది. అయితే సునీత ఇంటికి చేరలేదు. దీంతో ఆమె కోసం వెతికినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వినయ్‌కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతున్న ఇద్దరు విద్యార్థులు మృతి

విద్యార్థిని..



తేజశ్రీ (ఫైల్)

జగదేవ్‌పూర్(గజ్వేల్): చికిత్స పొందుతున్న విద్యార్థిని మృతి చెందింది. ఎస్‌ఐ కృష్ణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం ..నల్లగొండ జిల్లా ఇనపాముల గ్రామానికి చెందిన పూలమ్మ మల్లేశం దంపతుల కూతురు తేజశ్రీ(17), నల్లగొండ జిల్లా పానగల్లు గ్రామానికి చెందిన సైదులు బైక్‌పై సోమవారం కొమురెల్లి మల్లన్న దర్శనానికి బయలు దేరారు. ఈ క్రమంలో జగదేవ్‌పూర్ మండలం మునిగడపలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తేజశ్రీకి తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆమెను 108 ద్వారా గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. ఎస్‌ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బీటెక్ చదవడం ఇష్టం లేక...



విష్ణు మృతదేహం

మిరుదొడ్డి(దుబ్బాక): భూంపల్లి ఎస్‌ఐ గంగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని అల్మాజీపూర్ గ్రామానికి చెందిన బండారి మమత- నర్సింహులు దంపతులు. వీరికి కొడుకు విష్ణు(17), కూతురు వైష్ణవిలు ఉన్నారు. దంపతులు కుటుంబ కలహాలతో ఎనిమిదేళ్ల క్రితం క్రితం విడిపోయారు. మమత కామారెడ్డి జిల్లా బీబీపేట మండలం ఇస్సానగర్‌లో వైష్ణవితో కలిసి జీవిస్తోంది. నర్సింహులుతో కలిసి కొడుకు విష్ణు అల్మాజీపూర్‌లో ఉంటున్నాడు. కాగా ఇటీవల విష్ణు ఇంటర్ పూర్తయ్యింది. ఈ నేపథ్యంలో బీటెక్ చదవాలని తండ్రి నర్సింహులు విష్ణుపై ఒత్తిడి తెచ్చాడు. బీటెక్ తనకు ఇష్టం లేదని సీఏ చదువుతానని తండ్రితో వాదనకు దిగేవాడు. ఈ క్రమంలో ఈ నెల 25న బీటెక్ విషయంలో ఇద్దరూ గొడవపడ్డారు. సీఏ చదవాలన్న కోరికను చంపుకొని తండ్రి చెప్పిన బీటెక్ చదవలేనని తీవ్ర మనస్తాపానికి గురైన విష్ణు అదే రోజు ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగాడు. గమనించిన తండ్రి చికిత్స నిమిత్తం సిద్దిపేట జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాడు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్సకోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి విష్ణు తుది శ్వాస విడిచాడు. మృతుడి తల్లి మమత ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

క్లుప్తంగా

వైకుంఠధామం పనులు త్వరగా పూర్తిచేయాలి

దుబ్బాక మున్సిపల్ కమిషనర్ గణేశ్‌రెడ్డి



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ గణేశ్‌రెడ్డి

దుబ్బాక: మున్సిపాలిటీ పరిధిలోని లచ్చపేట 11వ వార్డులో నూతనంగా నిర్మిస్తున్న వైకుంఠ ధామం పనులను త్వరగా పూర్తిచేసి అందు బాటులోకి తీసుకురావాలని దుబ్బాక మున్సి పల్ కమిషనర్ పాతూరి గణేశ్‌రెడ్డి సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. మంగళవారం లచ్చపేట 11 వార్డులో వైకుంఠధామ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు లోపిస్తే కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు నంద్యాల శ్రీకాంత్, రామస్వామి, మున్సిపల్ సిబ్బంది ప్రవీణ్ తదితరులున్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలి

దుబ్బాక: చిన్నతనం నుంచే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని ఆ దిశగా ముందుకు సాగాలని ఎంఈఓ జోగు ప్రభుదాస్ అన్నారు. మంగళవారం పట్టణం లోని హరిజనవాడ ప్రభుత్వ ప్రాథమిక పాఠ శాలలో పఠనోత్సవం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఆయన పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దుబ్బాక మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం నుంచి పం పిణీ చేసిన పుస్తకాలను అందించామన్నారు.

పాండురంగ ఆశ్రమంలో కుంకుమార్చన

మర్కూక్(గజ్వేల్): మండలంలోని భవానందా పూర్‌లో పాండురంగ ఆశ్రమంలో 92వ ఆషాడి ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతు న్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం పండితులు రుక్మిణీ పాండురంగస్వా మికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిం చారు. భవానీ రామలింగేశ్వరస్వామికి మహ న్యాస పూర్వక రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి మాతకు కుంకుమార్చన తదితర పూజా కార్య క్రమాలు చేపట్టారు. అదేవిధంగా పుష్పార్చన, భవానీ శంకరులకు శత రుద్రాభిషేకం కుంకు మార్చన కార్యక్రమాలు నిర్వహించారు.

వేతన ఒప్పందం అమలు చేయాలి

వర్గల్(గజ్వేల్): వేతన ఒప్పందం అమలు డిమాండ్‌తో వర్గల్ మండలం గౌరారం సత్య సూర్య అల్యూమినీయం పరిశ్రమ కార్మికులు సమ్మె బాటపట్టారు. పరిశ్రమ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం పరి శ్రమ వద్ద చేపట్టిన కార్మికుల సమ్మెకు సీఐ టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి సం ఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొండివైఖరి వీడాలని, కార్మి కులను శ్రమదోపిడీకి గురిచేయడం సరికాద న్నారు. యాజమాన్యం వెంటనే చర్చలకు రావాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి సురేశ్, వర్కిం గ్ ప్రెసిడెంట్ రవిరాజ్, నాయకులు సద్దాం, సుధాకర్, రాజు, మల్లేశ్, అశోక్, నరేశ్, లక్ష్మి, ఊర్మిళ, శంకర్, కార్మికులు పాల్గొన్నారు.

సీనియర్‌పై జూనియర్ల దాడి



గొడవ విషయమై మాట్లాడుతున్న సమీర్ తల్లిదండ్రులు

కొండపాక(గజ్వేల్): బీఫార్మసీ సీనియర్ విద్యా ర్థిపై జూనియర్ విద్యార్థులు దాడి చేసిన సం ఘటన కొండపాక మండలంలోని వెలికట్ట గ్రామ శివారులో గల బీఫార్మసీ కళాశాల సమీ పంలో మంగళవారం సాయంత్రం చోటు చేసు కుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. చేర్యాలకు చెందిన సమీర్ బీఫార్మసీ కళాశాలలో ఫైనలి యర్ చదువుతున్నాడు. ఈ క్రమంలో జూని యర్ విద్యార్థులు సమీర్‌పై వ్యక్తిగతంగా కక్ష పెంచుకొని పలుమార్లు గొడవపడ్డారు. ఈ నేపథ్యంలో కళాశాల నుంచి బయటకు రాగానే జూనియర్ విద్యార్థులు సమీర్‌పై దాడిచేసి గాయపర్చారు. తోటి విద్యార్థులు వారించినా వినకుండా దాడి చేశారు. చికిత్స నిమిత్తం అతడిని గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిం చారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు కళాశాల నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వారు జరిగిన గొడవతో కళాశా లకు ఎలాంటి సంబంధం లేదంటూ దాటవే శారు. దీంతో తల్లిదండ్రులు నిర్వాహకుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ గొడవకు దిగారు. ఈ విషయమై కుకునూరుపల్లి పోలీసు లను సంప్రదించగా వారు తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు



బండారుపల్లిలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

తొగుట(దుబ్బాక): ప్రజలు ఎదుర్కొంటున్న సమ స్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని దుబ్బాక ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు తెలిపారు. మండలంలోని బండారుపల్లిలో మంగళ వారం పర్యటించి ప్రజలను అడిగి సమస్యలు తెలు సుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను పరిశీలించారు. ఫోన్ ద్వారా జిల్లా అధికారులతో మాట్లాడి త్వరగా ఇళ్లు పంపిణీ చేయాలని కోరారు. నిరుపేదల కోసం ఇళ్లు నిర్మించి నెలలు గడుస్తున్నా ఎందుకు పంపిణీ చేయడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలను సంద ర్శించి మరుగుదొడ్లు, మూత్రశాలలు పరిశుభ్రంగా ఉంచాలని హెచ్ఎం దామోదర్‌రెడ్డిని ఆదేశించారు. అనంతరం గ్రామపంచాయతీలో భూ నిర్వాసితు లతో సమావేశమై పూర్తిస్థాయి నష్టపరిహారం ఇప్పించేందుకు కృషి చేస్తానని రైతులకు హామీని చ్చారు. ఈ సందర్భంగా జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి భూ నిర్వాసితుల పరిహారం చెల్లింపు విషయమై మాట్లాడారు. రెం డురోజుల్లో కలెక్టర్‌తో సమావేశమై పరిహారం ఇప్పించేలా చర్యలు తీసుకుంటామని రైతులకు వివ రించారు. అనంతరం అనారోగ్యంతో బాధపడు తున్న ఉపసర్పంచ్ రమేశ్‌ను, విద్యుత్ షాక్‌తో మర ణించిన మహేందర్ కుటుంబాన్ని పరామర్శిం చారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు, తుక్కాపూర్ సర్పంచ్ చంద్రం, బీజేవైఎం జిల్లా మాజీ అధ్యక్షుడు విభీషణ్‌రెడ్డి, నాయకులు స్వామి రెడ్డి, పరమేశ్, కల్యాణ్‌దాస్ పాల్గొన్నారు.

భూమిపూజ

దుబ్బాకరూరల్: మండలంలోని బొప్పాపూర్ గ్రామంలో గౌడ సంఘం కమ్యూనిటీ భవన నిర్మాణానికి మంగళవారం ఎమ్మెల్యే రఘునందన్ రావు భూమిపూజ చేశారు. అదేవిధంగా పద్మనాభు నిపల్లి సర్పంచ్ రాములు తండ్రి మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు.

రక్తదానంతో ప్రాణాలు కాపాడొచ్చు



సిద్దిపేట ఆర్టీసీ మోడ్రన్ బస్టాండ్‌లో రక్తదానం చేస్తున్న సిబ్బంది



హుస్నాబాద్: రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న డిపో మేనేజర్ వెంకటేశ్వర్

సిద్దిపేట ఆర్టీసీ డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డి

సిద్దిపేటకమాన్: రక్తదానంతో నిండు ప్రాణాలు కాపాడొచ్చని సిద్దిపేట ఆర్టీసీ డిపో మేనేజర్ సుఖేం దర్‌రెడ్డి అన్నారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు సిద్దిపేట మోడ్రన్ బస్టాండ్ పైఅంతస్తులో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. 18 మంది ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ.. ఆర్టీసీని ప్రజలకు మరింత చేరువ చేయడానికి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. (టీ9) టైం తొమ్మిది గంటలు పేరుతో 60 కిలోమీట ర్లలోపు ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల లోపు కేవలం రూ.100 చెల్లించి అప్ అండ్ డౌన్ ప్రయాణం చేయొచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది, ప్రభుత్వ ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్ సిబ్బంది కనకచంద్రం, ఆంజనేయులు, ఇమ్రాన్, ప్రణీత్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్‌రూరల్: రక్తదానం చేసి మరొకరికి ప్రాణదా తలు కావాలని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపో మేనేజర్ సురేఖ పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరి ధిలోని జీపీపీ(గజ్వేల్–ప్రజ్ఞాపూర్) ఆర్టీసీ డిపోలో మంగళవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. ప్రమాదాలు జరిగినపుడు, ఇతర అత్యవసర సమయాల్లో రక్తం కోసం ఎంతోమంది ఎదురుచూస్తుంటారని, వారికి అవసరమయ్యే రక్తం దొరక ఇబ్బందులు ఎదుర్కొంటారని తెలిపారు. ఇలాంటి సందర్భంలో రక్తదానం చేయడంతో మరొకరి ప్రాణాలను కాపాడగలిగిన వారమవుతామని తెలిపారు. అనంతరం రక్తదానం చేసినవారికి పండ్లు, జ్యూస్‌తో పాటు ధ్రువపత్రా లను అందజేశారు. కార్యక్రమంలో జీపీపీ ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది, వైద్యసిబ్బంది, హెచ్ డీఎఫ్‌సీ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో రక్తదాన శిబిరం

హుస్నాబాద్: హుస్నాబాద్ ఆర్టీసీ డిపోలో మంగళ వారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని డిపో మేనేజర్ వెంకటేశ్వర్ ప్రారంభిం చారు. ఈ శిబిరంలో 70 మంది ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది రక్తందానం చేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ.. అన్ని దానాల్లో రక్తదానం గొప్పదన్నారు. ఒకరు రక్త దానం చేయడంతో మరో ముగ్గురు వ్యక్తుల ప్రాణా లను కాపాడినవారమవుతామన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు.

భూనిర్వాసితులకు న్యాయం చేయాలి

మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి



భూనిర్వాసితులతో మాట్లాడుతున్న ప్రవీణ్‌రెడ్డి

హుస్నాబాద్‌రూరల్: గౌరవెల్లి ప్రాజెక్టు భూ నిర్వాసితులకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని, వారిని విస్మరించడం బాధా కరమని కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి అన్నారు. మంగళవారం పోతారం(ఎస్) గ్రామంలో గడపగడపకూ కాం గ్రెస్ కార్యక్రమంలో పాల్గొని జెండా ఆవిష్కరిం చారు. అనంతరం పోతారం శివారులోని గౌరవె ల్లి ప్రాజెక్టు భూనిర్వాసితుల కాలనీని సందర్శిం చగా ప్రాజెక్టులో సర్వం కోల్పోయిన నిర్వా సితులు వారి బాధలను ఏకరవు పెట్టారు. ఈ సందర్భంగా అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి మాట్లాడు తూ.. భూ నిర్వాసితులకు తప్పకుండా న్యాయం చేస్తామన్నారు. ప్రజా సంక్షేమ పథకా లను అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో డీసీసీ ప్రతినిధి కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ శివయ్య, మాజీ సర్పంచ్ అలేటి జగ్గా రెడ్డి, మండల అధ్యక్షుడు చందు, లింగారెడ్డి, బండి కుమార్, శ్రీకాంత్‌రెడ్డి, బొమ్మగాని యాదగిరి, హరిబాబు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు



మరమ్మతులు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

వర్గల్(గజ్వేల్): మండలంలోని వేలూరు చెరువు కట్ట వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ సిబ్బం ది మంగళవారం మరమ్మతులు చేశారు. పోల్ మౌంటెడ్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్తింగ్ తీగను తాకి కరెంట్ షాక్‌తో సోమవారం మేకలు మృతి చెందిన విషయం తెలిసిందే. ఇలాంటి ఘటన పునరావృతం కాకుండా విద్యుత్ ఏఈ సంతోష్ కుమార్ ఆదేశాలతో సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. ఎర్తింగ్ తీగలను సరిచేశారు. మరమ్మతులు జరిపిన విషయం ఏఈ ధ్రువీ కరించారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి

దుబ్బాకటౌన్: విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి చెందిన సంఘటన దుబ్బాక పట్టణంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణం లోని ఎంకమ్మగారి శ్రీనివాస్‌రెడ్డికి చెందిన పాడి గేదెను 15వ వార్డు బాలికల హాస్టల్ వెనక భాగంలోని పొలంలో మేతకని తీసుకెళ్లాడు. అక్కడ కింద పడి ఉన్న కరెంట్ వైర్లను గమనిం చలేదు. ఈ క్రమంలో కరెంట్ వైర్లు తాకి పాడిగేదె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ప్రమాదంలో రైతుకు రూ.70 వేలకు పైగా నష్టం వాటిల్లిందని రోధించాడు. ఈ సంఘటన తెలిసిన వెంటనే విద్యుత్ అధికారులు అక్కడికి వచ్చి వైర్లను తొలగించారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు.

భూనిర్వాసితులకు అండగా కాంగ్రెస్

మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి



దీక్షలో మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, నిర్వాసితులు

వర్గల్(గజ్వేల్): భూనిర్వాసితులకు అండగా కాం గ్రెస్ పోరాటం కొనసాగిస్తుందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన వర్గల్ మండలం అవుసులోనిపల్లి వద్ద భూనిర్వాసితుల దీక్షకు సంఘీ భావం తెలిపారు. భూనిర్వాసితుల న్యాయపరమైన డిమాండ్లు నెరవేరే దాక తాము మద్దతుగా నిలుస్తామని స్పష్టం చేశారు. కాగా భూనిర్వాసి తులు చేపట్టిన దీక్ష మంగళవారం ఐదోరోజుకు చేరింది. మాజీ ఎంపీటీసీ యాదయ్య ఆధ్వర్యంలో కొనసాగిన దీక్షలో సంఘీభావంగా మాజీ ఎంపీపీ మోహన్, నాయకులు గోపాల్‌రెడ్డి, రమేశ్ తదిత రులు కూర్చున్నారు.

కుటుంబ సమస్యలను రాజకీయానికి వాడుకోవడం సిగ్గుచేటు

మున్సిపల్ చైర్‌పర్సన్ స్వరూపారాణి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ స్వరూపారాణి

చేర్యాల(సిద్దిపేట): కుటుంబ సమస్యలను వాడు కొని ప్రతిపక్ష నాయకులు జనగామ ఎమ్మెల్యే ముత్తి రెడ్డి యాదగిరిరెడ్డిని బదనాం చేస్తూ రాజకీయం చేయడం సిగ్గుచేటని మున్సిపల్ చైర్‌పర్సన్ అం కుగారి స్వరూపారాణి అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని కార్యాలయంలో పట్టణ అధ్య క్షుడు ముస్త్యాల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్ కుమార్‌రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ పూర్మ వెంకట్ రెడ్డి, నాలుగు మండలాల యూత్ ఇన్‌చార్జి శివగారి అంజయ్యతో కలిసి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కూతురు తుల్జాభవానిరెడ్డి పేరు మీద రిజిస్ట్రేషన్ చేయబడిన పట్టా భూమిని మున్సిపాలిటీకి అప్ప గించడాన్ని బీఆర్ఎస్ తరఫున స్వాగతిస్తున్నామ న్నారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న క్రమంలో మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పనిగట్టుకొని తప్పుడు ప్రకటనలతో చేస్తున్న ఎమ్మెల్యేపై బుర దజల్లే ప్రయత్నాన్ని మానుకోవాలన్నారు. స్మశాన వాటిక నిర్మాణం కోసం రూ.లక్ష అడ్వాన్స్ ఇచ్చిన భూమిని ప్రతాప్‌రెడ్డి పేరుమీద రిజిస్ట్రేషన్ చేసు కున్న విషయం ప్రజలకు తెలిసిందే అన్నారు. పదవి కోసం పార్టీలు మారే ప్రతాప్‌రెడ్డిని చేర్యాల ప్రజలు రానున్న రోజుల్లో తరిమికొట్టడం ఖాయమన్నారు. సమావేశంలో కోఆప్షన్ సభ్యురాల అంజనీదేవి, పట్టణ మహిళా అధ్యక్షురాలు రంజిత, పట్టణ యూత్ అధ్యక్షుడు భిక్షపతి, మార్కెట్ డైరెక్టర్లు రాజే శం, ఆగమల్లు, మల్లన్న ఆలయ మాజీ డైరెక్టర్ బాబు, నాయకులు ఎండీ.ఎక్బాల్, కృష్ణమూర్తి, నర్సింలు, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **అనారోగ్యంతో ఉపాధ్యాయురాలు మృతి**

గజ్వేల్‌రూరల్: అనారోగ్యంతో ఓ ఉపాధ్యాయు రాలు మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి.. గజ్వేల్‌కు చెందిన ఏ. ఉమాదేవి ప్రజ్ఞాపూర్‌లోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో 2018 నుంచి విద్యార్థులకు జీవశాస్త్రం సబ్జెక్టును బోధిస్తుంది. ఈ క్రమంలో అనారోగ్యానికి గురైన ఉమాదేవి కొం తకాలంగా హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎంఈవో సునీతతో పాటు ఉపాధ్యాయులు విషాదంలో మునిగిపోయారు.

◆ **దివ్యాంగులకు బస్‌పాస్‌ల పంపిణీ**

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని చుంచ నకోట గ్రామంలో మంగళవారం దివ్యాంగులకు జనగామ డిపో వీటీఓ కిషన్ బస్‌పాస్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దివ్యాంగుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్, దివ్యాంగులు పాల్గొన్నారు.

◆ **పాఠశాలను వెంటనే తెరిపించాలి**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేటలోని అంబేడ్కర్ నగర్‌లో మూసివేసిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశా ల(నంబర్–3)ను వెంటనే తెరిపించాలని అంబేడ్క ర్‌నగర్ యువకులు డిమాండ్ చేస్తూ మంగళవారం పట్టణంలోని బస్టాండ్‌కు వెళ్లే రహదారిపై ధర్నా చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ అధ్య క్షుడు పుట్ల దినేశ్, సీపీఎం 19వ వార్డ్ కార్యదర్శి కొం డం సంజు, భానుసాయి, నవీన్, విక్కీ, నవీన్, రాజు, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **మద్యం సేవించి వాహనాలు నడపరాదు**

చేర్యాల(సిద్దిపేట): మద్యం సేవించి వాహనాలు నడపొద్దని స్థానిక ఎస్ఐ భాస్కర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణ శివారులో వాహనాల తని ఖీలు నిర్వహించిన అనంతరం ఎస్ఐ మాట్లా డుతూ.. సరైన పత్రాలు, హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్న 15 మందిపై కేసు నమోదు చేయడంతో పాటు ఒకరిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

◆ **దరఖాస్తుల ఆహ్వానం**

మద్దూరు(హుస్నాబాద్): మండల కేంద్రంలోని ఎస్సీ వసతి గృహంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వార్డెన్ రాజయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6 నుంచి 10వ తరగతి వరకు విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు ఈ వసతి గృహంలో చేరేందుకుగాను దరఖాస్తులు చేసుకోవా లన్నారు. ఈ వసతి గృహంలో 70 సీట్లు ఉన్నాయ ని, ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలు అం దిస్తున్నట్లు తెలిపారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ సంపత్



ఆస్పత్రికి జరిమానా విధిస్తున్న మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్

సిద్దిపేటజోన్: వార్డుల్లో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళ వారం ఆయన పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటిం చారు. పట్టణంలోని 23వ వార్డులో యూజీడీ సమస్య లను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని యూజీడీ ఏఈకి సూచనలు చేశారు. అనంతరం శివాజీనగర్‌లో శోభ ఆస్పత్రి నిర్మాణ వ్యర్థాలను (డేబ్రెస్)రోడ్డుపై వేయడంతో మున్సిపల్ కమిషనర్ ఆస్పత్రికి వెయ్యి రూపాయల జరిమానా విధించారు.

సిద్దిపేటకమాన్: సిద్దిపేట ఆర్టీసీ మోడ్రన్ బస్టాం డ్‌ను కమిషనర్ సంపత్ కుమార్ తనిఖీ చేశారు. బస్టాండ్ ఆవరణలో ఊడ్చిన చెత్తను బస్టాండ్ వెనకాల ఉన్న డ్రైనేజీలో వేస్తున్నారని తెలిసి మరోసారి ఇలాంటి పనులు పునరావృతం జరిగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డిపో మేనే జర్ సుఖేందర్‌రెడ్డికి తెలిపారు. బస్టాండ్ లోపల ఉన్న బాత్‌రూంలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సతీష్, ఎస్సై వనిత, తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే బీజేపీ ధ్యేయం



హుస్నాబాద్: ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు



వీరాపూర్‌లో..

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీరాం చక్రవర్తి

హుస్నాబాద్: సేవా, సుపరిపాలన, పేదల సంక్షే మమే ధ్యేయంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పని చేస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మ శ్రీరాంచక్రవర్తి అన్నారు. మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ఎల్లంబజార్‌లో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ అధి కారంలోకి వచ్చేలా ప్రతీ కార్యకర్త కృషి చేయాల న్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు శంకర్‌బా బు, సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు మెంబర్ తిరు మల, బీజేపీ జిల్లా కోశాధికారి శ్రీనివాస్, అసెంబ్లీ కో–కన్వీనర్ వేణుగోపాల్‌రావు ఉన్నారు.

బెజ్జంకి(సిద్దిపేట): కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభు త్వమే రాష్ట్రంలో ఏర్పడ్డప్పుడు వచ్చే డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే అభివృద్ధి వేగవంతంగా జరుగుతుం దని బీజేపీ రాష్ట్ర నాయకుడు సొల్లు అజయ్‌వర్మ, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్‌రె డ్డిలు పేర్కొన్నారు. మండలంలోని వీరాపూర్‌లో మంగళవారం వారు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ఇంటింటికీ వివరిం చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దోనె అశోక్, నాయకులు కొండ్ల వెంకటేశం, లక్ష్మి, అంజి రెడ్డి, మోహన్‌రెడ్డి, కిష్టయ్య, మురళీధర్‌రావు, శ్రీధ ర్‌రావు, మొండయ్య, కనకయ్య, మల్లయ్య, భార తవ్వ తదితరులు పాల్గొన్నారు.

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని గట్టు మిట్టలో మంగళవారం ఇంటింటికీ బీజేపీ కార్యక్ర మాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం, బీజేవైఎం మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, సాగర్, అనిల్, రాజయ్య, దినేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

‘హామీలను విస్మరించిన బీఆర్ఎస్’

కొండపాక(గజ్వేల్): ప్రజా సంక్షేమం కోసం పని చేయడం కాంగ్రెస్‌కే సాధ్యమని గజ్వేల్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ప్రమోద్ కుమార్ పేర్కొన్నారు. మండల పరిధిలోని దుద్దెడలో గల ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో మండల అధ్యక్షుడు వాసరి లింగారావు ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు తూంకుం ట నర్సారెడ్డితో కలిసి కార్యకర్తల సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆచరణకు సాధ్యం కానీ హామీలను ఇచ్చి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందన్నారు. కార్యక ర్తలే పార్టీకి పట్టుకొమ్మలన్నారు. కార్యక్రమంలో జిల్లా యూత్ అధ్యక్షురాలు ఆంక్షారెడ్డి, మైనార్టీ అధ్య క్షుడు షరీఫ్, కుకునూరుపల్లి మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

సీఎం, మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం



చిన్నకోడూరు: క్షీరాభిషేకం చేస్తున్న ప్రజాప్రతినిధులు, రైతులు

చిన్నకోడూరు(సిద్దిపేట): రైతులకు పెట్టుబడి సాయం రైతు ఖాతాల్లో జమ చేస్తున్నందున మంగ ళవారం మండల పరిధిలోని మైలారంలో రైతులు సీఎం కేసీ ఆర్, మంత్రి హరీశ్‌రావు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ కొండం వని త, ఎంపీపీ ఉపాధ్యక్షుడు పాప య్యలు మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతుల సంక్షే మానికి అహర్నిశలు కృషి చేస్తుందన్నారు. రైతు సం క్షేమమే లక్ష్యంగా పలు పథకాలు అమలు చేస్తుంద న్నారు. రైతుబంధు, రైతు బీమా రైతులకు వరంగా మారిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కాల్వ ఎల్లయ్య, రైతులు పాల్గొన్నారు.

రాయపోలు(దుబ్బాక): రైతుల పాలిట సీఎం కేసీఆర్ దేవుడని దౌల్తాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇప్ప లక్ష్మి అన్నారు. మంగళవారం దౌల్తాబాద్‌లోని వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యుల సర్వసభ్య సమావేశం నిర్వహించిన అనం తరం కార్యాలయం ఎదుట సీఎం కేసీఆర్ చిత్రప టానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ వేమ శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.

సోలిపేట రామచంద్రారెడ్డికి నివాళి



నివాళులర్పిస్తున్న ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, తదితరులు



అంత్యక్రియల్లో ఎమ్మెల్యే రఘునందన్‌రావు

దుబ్బాకటౌన్: మాజీ రాజ్యసభ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే సోలిపేట రామచంద్రారెడ్డి అంత్యక్రి యలు హైదరాబాద్‌లోని మహాప్రస్థానంలో మం గళవారం సాయంత్రం జరిగాయి. ఈ అంత్యక్రి యల్లో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు, కాంగ్రెస్ నియోజ కవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి, సోలిపేట సుజాత, సతీశ్‌రెడ్డి, చిట్టాపూర్ సర్పంచ్ రాజయ్య, పలువురు గ్రామస్తులు, నేతలు వెంకటయ్య, ర్యాకం శ్రీరా ములు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు



చిన్నకోడూరు(సిద్దిపేట): బహుమతులతో విజేతలు, బ్యాంక్ సిబ్బంది

చిన్నకోడూరు(సిద్దిపేట): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తేనే సమాజాభివృద్ధి సాధ్యమని చిన్నకోడూరు యూనియన్ బ్యాంక్ మేనేజర్ సదరం యాదవ్ అన్నారు. మండల పరి ధిలోని చంద్లాపూర్ ఉన్నత పాఠశాలలో మంగళ వారం లీడ్ ఇండియా బ్యాంక్ ఆధ్వర్యంలో విద్యా ర్థులకు మండల స్థాయి క్విజ్ పోటీలు నిర్వహిం చారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రామ స్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

కోహెడ(హుస్నాబాద్): మండల కేంద్రంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ పాఠశాలలో మండలం లోని ఎనిమిది ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు స్థానిక తెలంగాణ గ్రామీణ బ్యాంక్ వారు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రథమ బహుమతి ప్రభుత్వ సాంఘిక సంక్షేమ పాఠశాలకు చెందిన డి.వివేకవర్ధన్, బి.రాజేశ్ సాధించారు. ద్వితీయ బహుమతి చెంచల్‌చెర్వుపల్లి హైస్కూల్ విద్యార్థులు ఎం.కొండల్‌రెడ్డి, ఆర్ అఖి లేశ్వర్ అదేవిధంగా గుండారెడ్డిపల్లి హైస్కూల్ విద్యార్థులు కె.శృతికీర్తన, ఎం.నందిని తృతీయ బహుమతి పొందారు. విద్యార్థులకు ప్రిన్సిపాల్ కె.వి.చలపతి, మేనేజర్ మురళీధర్‌లు బహుమ తులు ప్రదానం చేశారు.

రాయపోలు(దుబ్బాక): రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇం డియా ఆధ్వర్యంలో దౌల్తాబాద్, రాయపోలు మం డలాల్లోని ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఇందులో తిర్మలాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అఖిల, మణికంఠలు ప్రథమ బహుమతులు గెలుచుకున్నారు. రామారం విద్యార్థులు ద్వితీయ బహుమతులు గెలుచుకు న్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ బ్యాంక్ సిబ్బందితో పాటు ఎంఈఓ నర్సమ్మ, కాంప్లెక్స్ హెచ్ఎం ప్రకా శం తదితరులు పాల్గొన్నారు.